

పోలీస్ శాఖపై విశ్వాసం పెంచుతాం

సైబర్ నేరాల కట్టడిపై ప్రత్యేక దృష్టి

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

బాధ్యతల స్వీకరణ సందర్భంగా ఎస్పీ వి.రత్న



ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న వి.రత్న

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లాలో పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసం పెంచేలా విధులు నిర్వహిస్తామని నూతన ఎస్పీ వి.రత్న తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీగా రత్న బుధవారం నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పాటుపడతానని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలిందించేలా కృషి చేస్తామన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదులను అత్యధిక ప్రాధాన్యతతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి నిర్మూలనకు కార్యాచరణ ప్రణాళికతో చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు శాఖలో అందరూ చట్టానికి లోబడి ఉద్యోగం చేయాలని తెలిపారు. సైబర్ నేరాలపై పర్యవేక్షణ చేస్తూ జిల్లాలో క్రైమ్ రేట్ పెరగకుండా చూస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు. ఇసుక అక్రమణ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. అనంతరం ఎస్పీని అదనపు ఎస్పీ ఎన్.విష్ణు, ఎఆర్ డీఎస్పీ జెడ్.విజయ్ కుమార్, డీఎస్పీలు శ్రీలత, వాసుదేవన్, కన్జక్షన్ బాజీ జామ్ సైదా, శ్రీనివాసులు, ఎస్‌బి సిఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఏవో సుజాత, సిసి రాఘవేంద్ర తదితరులు నూతన ఎస్పీకి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



వాలంటీర్ల భవితవ్యం ఎటు..!

◆ రాజీనామా చేసిన వారి భవిష్యత్తు అగమ్యగోచరం

◆ కొనసాగింపుపై స్పష్టతనివ్వని ప్రభుత్వం



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గడిచిన ఐదేళ్లగా ప్రజలకు సేవలందించిన వాలంటీర్ల భవిత్యం ఏ రకంగా ఉండనుందన్న దానిపై ఇప్పుడు సర్వత్రా చర్చ నడుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలోనే ఆ వ్యవస్థను కొనసాగిస్తామని హామీనిచ్చారు. తాజాగా కూడా అటువంటి ప్రకటనే రావడంతో ముందు పనిచేసిన వాలంటీరర్లలో కొంత ఊరట కనిపిస్తోంది. కొత్త వారిని నియమిస్తారా.. లేక పాత వారినే కొనసాగిస్తారా..? అన్న సందేహాలు మాత్రం ఉత్పన్నం అవుతున్నాయి. ఒకవైపు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చంనాయుడు మాత్రం రాజీనామా చేసిన వారిని కొనసాగించే అవకాశం లేదన్న ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో తమ పరిస్థితి ఏ రకంగా ఉండనుందన్న దానిపై వాలంటీర్లలో సందిగ్ధత నెలకొంది.

రాజకీయ ఒత్తిళ్లతో సాగిన రాజీనామాలు

ఎన్నికల సమయంలో వాలంటీర్ల సేవలను వినియోగించుకునేందుకు వీల్లేదని ఎన్నికల సంఘం ఆదేశాలిచ్చింది. దీంతో ఎన్నికల్లో తమకు అనుకూలంగా పనిచేస్తారని భావించిన అప్పటి అధికార పార్టీ ఈ నిర్ణయంతో వారిని ఏకంగా విధుల నుంచి తప్పుకునేలా రాజకీయపరమైన ఒత్తిళ్లు తీసుకొచ్చారు. అప్పటి ప్రజాప్రతినిధులే ఒక ఫార్మట్‌ను రూపొందించి అందరితో సంతకాలు తీసుకున్నారు. ఇందుకు మూడు నెలల వేతనాన్ని కూడా పార్టీ తరుపున ఇస్తున్నామని కొంత మొత్తాన్ని ముట్టజెప్పారు. తరువాత అధికారంలోకి వచ్చేది తామే, తిరిగి విధుల్లోకి తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో నేతలిచ్చిన ఫార్మట్‌పై సంతకాలు చేసి ఇచ్చారు. ఈ రాజీనామాలను అప్పుడు ఎన్నికల సంఘం పాలనలోనున్న అధికారులు ఆమోదించారు. ఎన్నికల ఫలితాలు వైసిపికి ఊహించని విధంగా వచ్చాయి. దీంతో వాలంటీర్ల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. అనంతరం కొత్త ప్రభుత్వం కూడా ఉన్న వారినైనా ఏ రకంగా ఉపయోగించుకుంటుందో ఇంత వరకు ప్రకటించలేదు. వారి చేత ఇప్పటి వరకు సేవలు వినియోగించుకోలేదు.

రాజీనామా చేయని వారు నామమాత్రమే

అనంతపురం జిల్లాలో 571 గ్రామ పంచాయతీలతోపాటు, అనంతపురం నగరపాలక సంస్థ తోపాటు ఐదు మున్సిపాలిటీలున్నాయి. ఇందులో ప్రతి 50 ఇళ్లకు ఒకరు చొప్పున వాలంటీర్లను గత ప్రభుత్వం నియమించింది. పది వేల మందికిపైగా ఉన్నారు. ఇందులో అత్యధిక మంది రాజీనామాలు చేశారు. ఉదాహరణకు ఒక్క అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలోనే 1147 మంది వంటీర్లు పనిచేసేవారు. ఎన్నికల సమయంలో వీరిలో 1108 మంది రాజీనామాలు చేశారు. తక్కిన 39 మంది మాత్రమే విధుల్లోనున్నారు. ఇప్పుడు వీరిలో ఎవరిని విధుల్లోకి తీసుకోలేదు. ప్రభుత్వం దీనిపై ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఆశగా ఎదురు చూస్తున్నారు.

27న సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రి స్వయం ప్రతిపత్తిపై సమావేశం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టర్

అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రతిపత్తి, సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27వ తేదీన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద అఖిల పక్ష సమావేశం నిర్వహిస్తున్నట్టు పలువురు వక్తలు తెలిపారు. బుధవారం నాడు మున్సిపల్ కాంప్లెక్స్‌లో పట్టణ పౌర సంఘాల ఐక్యవేదిక కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నగర పౌరులు ఎదుర్కొంటున్న సమస్యలు డ్రెయినేజీ, స్పీడ్ బ్రేకర్లు, రోడ్ల సమస్యలు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ స్వయం ప్రతిపత్తిపై సమావేశంలో చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈసందర్భంగా పట్టణ పౌర సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు అడ్వకేట్ రసూల్ మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ స్వయం ప్రతిపత్తిపై ఈ నెల 27వ తేదీన అనంతపురం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వద్ద నిర్వహించే అఖిలపక్ష సమావేశానికి పౌరులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ పౌరసంఘాల ఐక్యవేదిక గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఏజీ.రాజమోహన్ పాల్గొన్నారు.

కదిరి రేణుక ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

మహిళ కడుపులోని 12 కిలోల గడ్డను తొలగించిన వైద్యులు



వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు (ఇన్‌సెట్‌లో శస్త్రచికిత్స చేసి బయటకు తీసిన 12 కిలోల గడ్డ)

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణం లోని రేణుక మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. ఓ మహిళ కడుపులో ఉన్న 12 కిలోల గడ్డను వైద్యులు తొలిగించారు. ఇందుకు సంబంధించి వైద్యులు తెలిపిన వివరాలు...కదిరి పట్టణానికి చెందిన మహిళా ఈ నెల 15న రేణుక హాస్పిటల్‌కు వచ్చింది. 4 సంవత్సారాలుగా పొట్టవాపుతో ఇబ్బంది పడుతున్నానని చెప్పింది. దీంతో వైద్యులు పరీక్షలు చేసి అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని చెప్పారు. అందుకు పేషెంట్, వారి బంధువులు అంగీకరించడంతో రేణుక హాస్పిటల్ వైద్యుల బృందం డాక్టర్. రేణుకారెడ్డి, డాక్టర్ అనూష సలహాతో శస్త్ర చికిత్స నిర్వహించారు. మహిళ కడుపులో నుంచి 5 లీటర్ల అసిటిఎస్ ఫ్యూయిడ్‌తో పాటు 12 కిలోల గడ్డను తొలగించారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు రేణుకా రెడ్డి, డాక్టర్ అనుష అశోక్ రెడ్డి తెలిపారు. ఇలాంటి ఎన్నో రకాల శస్త్రచికిత్సలకు ఇక్కడి ప్రజలు బెంగళూరు హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్తుంటారని అలాంటి వారికి కదిరిలోనే ఇలాంటి ఆపరేషన్లు చేసి మెరుగైన సేవలు అందించాలని లక్ష్యంతో పని చేస్తునానమని డాక్టర్ రేణుకారెడ్డి, డాక్టర్ అశోక్ కుమార్ రెడ్డి తెలిపారు.

హమాలీలకు ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలి : సిఐటియు


సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్. వెంకటేష్

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

సివిల్ సప్లై హమాలీలకు ఇఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని మార్కెట్ యార్డులో చెన్నేకొత్తపల్లి, బుక్కపట్నం, ధర్మవరం మండలాలలో ఉన్న స్టాక్ పాయింట్ల హమాలీలతో జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు నేలకోటప్ప అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఇఎస్ వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో 12 స్టాక్ పాయింట్లలో 200 మందికి పైగా హమాలీలు అనేక సంవత్సరాలుగా పనులు చేస్తున్నారన్నారు. చేసిన పనికి కూలి అడితే తమకు సంబంధం లేదని స్టాక్ పాయింట్లలో ఉన్న కాంట్రాక్టర్లు చెప్పడం బాధాకరమన్నారు. నిత్యం తాగడానికి మంచినీరు ఇవ్వాలని ఇవ్వాలన్న నిబంధన ఉన్నప్పటికీ, వాటిని కూడా కొన్ని స్టాక్ పాయింట్లవారు పట్టించుకోలేదని విమర్శించారు. ఇక స్వీపర్లు వాచ్‌మెన్‌లకు 7 నెలల నుంచి వేతనాలు ఇవ్వలేదని ఇలా అయితే వారు వారి కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వమైనా హమాలీల పట్ల సానుకూలంగా వ్యవహరించి వారి సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, కోశాధికారి రాందాస్, మేస్త్రీలు ఆంజనేయులు, గంగాధర్, కదిరప్ప, కోటప్ప, సిఐటియు మండల అధ్యక్షులు ఆదినారాయణ, కార్యదర్శి అయూబ్ ఖాన్, జిల్లా నాయకులు జెవి. రమణ, ఎస్‌హెచ్. బాషా, పెద్దన్న, మారుతి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి- హిందూపురం

పెనుగొండ మండలం మోటూరు పంచాయతీ సుద్దబట్లపల్లిలో దళితులపై దాడి చేసిన వారి పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కెవిపిఎస్ నాయకులతో కలిసి పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. సమాజంలో ఇంత మార్పులు వస్తున్న పనుల కోసం వచ్చిన దళితులపై దాడులు ఇంకా జరుగుతున్నాయన్నారు. దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తు గురువారం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు హనుమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, తులసీరామ్, వెంకట్ రాముడు, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు నియామకాలు చేపట్టాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కొత్తచెరువు

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఎస్ఎస్ఎలోనిసెక్టోరియల్ పోస్టుల ఖాళీలను బహిర్గతం చేసి నోటిఫికేషన్ విడుదల చేసి నిబంధనలకు అణుగుణంఆ నియామకాలు చేపట్టాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయచంద్ర రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఇఒ మీనాక్షికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022 సంవత్సరంలో అర్హత లేకుండా నియామకాలు చేపట్టడంతో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేసి సమస్యను అప్పటి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. విచారణ నిర్వహించి వాటి నియామకాలు రద్దుచేసి నూతన నోటిఫికేషన్ ద్వారా నియామకాలు చేపట్టారన్నారు. ప్రస్తుతం అలాంటి తప్పులు చేయకుండా అధికారులు పారదర్శకంగా నిబంధనల మేరకే నోటిఫికేషన్ ఇచ్చి అర్హత కలిగిన ఉపాధ్యాయులను మెరిట్ ప్రాతిపదికన నియమించాలన్నారు. ఇలా జరగని సమక్షంలో ఇతర ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు భూతన్న, సహాధ్యక్షుడు బాబు, సీతాలక్ష్మి, కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు తాహిర్ వలి, శివకుమార్, లక్ష్మీనారాయణ, నరేష్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

19న డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

పుట్టపర్తి క్రైమ్ : ప్రయాణికులు ఇబ్బందులు, వారి సూచనలు చెప్పేందుకు ఈనెల 19న డయల్ యువర్ ఆర్టీసీ డిఎం కార్యక్రమం చేపట్టనున్నామని డిపో మేనేజర్ ఇనయతుల్లా తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పుట్టపర్తి డిపో పరిధిలోని బస్సులు, రవాణా సౌకర్యం, ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫోన్ చేయవచ్చు అని అన్నారు. ఆరోజు ఉదయం 11 గంటల నుంచి 12:30 గంటల వరకు డిపో మేనేజర్ కు ఫోన్ చేసి మీ అభిప్రాయాలు, సలహాలు సూచనలు చెప్పవచ్చన్నారు. ప్రయాణికులు 9959225857 కు ఫోన్ చేయాలని కోరారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు బడా సుబ్బిరెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సహాయాన్ని వెంటనే రైతులకు అందించి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం హిందూపురంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 అందిస్తామని ప్రకటించడం జరిగిందన్నారు. అయితే ఇప్పటి వరకు ఆ పెట్టుబడిసాయం అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే విధంగా గత ఏడాది పంట నష్టపోయిన రైతులందరికీ వెంటనే పంటల బీమాను విడుదల చేయాలని కోరారు. రైతులకు సంబంధించిన అన్ని రకాల రుణాలను మాఫీ చేసి, కేరళ తరహాలో రైతు విమోచన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోటార్లకు మీటర్లు పెట్టే జీవో నెంబర్ 22ను పూర్తిగా రద్దు చేయాలన్నారు. భూయాజమాన్యంతో ఏమాత్రం సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డును అందజేసి ప్రభుత్వం నుండి అమలు చేసే సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. పట్టు రైతులకు అందజేయాల్సిన రూ.60 కోట్ల ప్రోత్సహకాలను వెంటనే విడుదల చేయాలన్నారు. పట్టు రైతుల షెడ్ల నిర్మాణానికి సబ్సిడీని మరింత పెంచాలన్నారు. వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో అనేక మంది రైతులు పాడి పరిశ్రమ వైపు దృష్టి సారిస్తున్నారని, తద్వారా పాల ఉత్పత్తి పెరిగిందని అందుకు అనుగుణంగా ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాడి పశువులకు సైతం మెరుగైన వైద్య చికిత్సలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారి విస్తరణ, పరిశ్రమల ఏర్పాటు పేరిట రైతుల నుండి సేకరిస్తున్న భూములకు వెంటనే పరిహారం చెల్లించాలన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, కౌలు రైతుల ఇబ్బందులను తీర్చాలని గురువారం అన్ని సచివాలయాల వద్ద నిరసన వ్యక్తం చేసి వినతి పత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. రైతులు అధిక సంఖ్యలో ఆయా సచివాలయాల వద్ద జరిగే నిరసనలో పాల్గొని విజయవంతం చేయాలని సుబ్బిరెడ్డి కోరారు.

సమస్యల నెలవు.. అడపాల వీధి

ప్రజాశక్తి - కదిరి అర్బన్

మున్సిపాలిటీ పరిధిలోని అడపాల వీధిలో సమస్యలు కొలువుదీరాయి. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా అడపాల వీధి తయారైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వీధిలో కాలువల నిర్మాణం చేపట్టారు. అయితే కాలువలు ఎత్తు పెంచి వేయడంతో కాలువలోని మురుగునీరు నివాసాల్లోకి వెళు తోందనిస్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారుల పరిస్థితికి వస్తే వర్షం వచ్చి నిలిచిపోయి రోజులు గడిచిన వర్షపు నీరు నిలువ ఉంటుందని దీంతో ఆయా ప్రాంతాల్లో దోమలు పెరిగి విష జ్వరాలకు ప్రబలుతున్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక కాలనీలో ఉండే వైఎస్ఆర్ పార్కు పరిస్థితి మరింత అధ్వానంగా తయారైందని వాపోతున్నారు. పార్కు చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి విషపు పురుగులు సైతం సంచరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక కుబా మసీదు రహదారి మొత్తం బురద మాయమై ఉంటుందని మహిళలు ఆవేదన చెందుతున్నారు. పట్టణంలోని మరికొన్ని ప్రధాన వీధులలో డ్రైనేజీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని భాస్కర్ నాయక్, ఆదినారాయణ రెడ్డి వాపోతున్నారు. స్థానిక ఎమ్మెల్యే కందికుంట ఒక్కసారి తమ ప్రాంతంలో పర్యటించి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని అడపాల వీధి ప్రజలు కోరుతున్నారు.


అడపాల వీధిలోని రోడ్డుపై నిలిచిన నీరు

బీసీ హాస్టల్‌లో అసౌకర్యాలు

ఇబ్బందుల్లో విద్యార్థులు


ప్రహరీ లేని హాస్టల్ భవనం

ప్రజాశక్తి గోరంట్ల

పట్టణంలో బీసీ హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ప్రభుత్వం ఇప్పటివరకు కాస్మోటిక్‌ఛార్జీలు, దుప్పట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే హాస్టల్‌కు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులకు అసౌకర్యంగా ఉంది. హాస్టల్ చుట్టూ ముళ్లచెట్లు, గుంతలు ఏర్పడడంతో వర్షపు నీరు నిలువ ఉండి దోమలు పెరిగి విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారు. హాస్టల్‌కు సొంతభవనం ఉన్నా ప్రహరీ లేకపోవడంతో హాస్టల్‌లోకి పశు వులు, పందులు ప్రవేశిస్తుంటాయి. ప్రస్తుతం హాస్టల్‌కు రెగ్యులర్ వార్డెన్ లేకపోవటం కూడా విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. ప్రస్తుత ఇన్‌ఛార్జి గోపాల్ పుట్టపర్తి హాస్టల్‌కు రెగ్యులర్ వార్డెన్ గా ఉన్నారు. దీంతో హాస్టల్ పర్యవేక్షణ సరిగా ఉండటం లేదు.ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు రెగ్యులర్ వార్డన్‌ను నియమించాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

పారదర్శక సర్వే అవసరం

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

కార్యక్రమాలు విజయవంతం కావాలంటే చేపట్టే ఏ సర్వే అయినా పారదర్శకంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ భాను ప్రకాష్ పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణం నందు ఏర్పాటుచేసిన కుష్టు వ్యాధి నివారణ, బాధితుల గుర్తింపు ఎల్‌సిడి కార్యక్రమంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రతి సంవత్సరం జూలై మాసంలో 14 రోజులు పాటు నిర్వహించే ఈ కార్యక్రమం ఈనెల 18వ తేదీ నుండి ఆగస్టు 2 వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ సర్వేను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కమల్ రోహిత్, సామాజిక ఆరోగ్య అధికారులు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి 'రెయిన్‌బో' విద్యార్థి

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

స్థానిక రెయిన్‌బో పాఠశాలలో చదివిన నల్లమాడ మండలం గంగాపురం గ్రామానికి మేఘనాథ్ రెడ్డి అనే విద్యార్థి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించినట్లు రెయిన్‌బో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయసింహ రెడ్డి తెలిపారు. 2023-2024 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనపర్చి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన మేఘనాథ్‌రెడ్డిని పాఠశాల యాజమాన్యం అభినందించింది.

సిఐటియు మండల కన్వీనర్‌గా కుళ్లాయప్ప

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

సిఐటియు మండల కన్వీనర్ గా కుళ్లాయప్పను ఎంపిక చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి సీనియర్ నాయకులు రమణ, సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, హాజరై సిఐటియు నూతన కమిటీని ఎంపిక చేశారు. సిఐటియు మండల కన్వీనర్‌గా కుళ్లాయప్ప, కో కన్వీనర్ గా పోరాటాల శ్రీరాములును ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా కేశవ శ్రీనివాసులు, అంగన్వాడీ వరలక్ష్మి, మనిమాల, శ్రీనాథ్, రమణమ్మ, నిర్మల, భాగ్యమ్మ, సుగుణమ్మ, లక్ష్మీదేవి, సాలెమ్మ, ఇందిరమ్మ, రామలక్ష్మమ్మను ఎంపిక చేశారు.

అక్క దేవతల జాతర

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని తారకరామాపురంలోని అక్కమ్మ దేవతల పరుష ఉత్సవాన్ని బుధవారం పూజారులు గుంజరమహేశ్, బయన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుట్టకిందపల్లికి చెందిన కేశమ్మ, బాలు కుటుంబసభ్యులు అమ్మవారికి 7 తులాల వెండి నాగపడిగను బహుకరించారు.

రోడ్డు నిర్మాణపనులు ప్రారంభం

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాటకు కట్టుబడిన మంత్రి సవితమ్మ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని నాగినాయనాచెరువు గ్రామంలో కాలనీ నుండి దేవస్థానం వరకు ఉన్న రోడ్డు చాలా అధ్వానంగా ఉండేది. గత ప్రభుత్వంలో కాలువలు ఏర్పాటు చేయకపోవడం, చిన్నిపాటి వర్షం పడ్డా నీటి కుంటలా తయారయ్యేది. ఎన్నికల ప్రచారానికి వచ్చిన సవితకు నాయకులు డీవి ఆంజనేయులు, గ్రామస్తులు సమస్యను వివరించారు. తాను గెలిస్తే తప్పక మరమ్మతులు చేయిస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఏకాదశి పండుగకు భక్తులు ఇబ్బందులు పడకూడదని వెంటనే మరమ్మతులు చేయించారు. జేసీబీ, ట్రాక్టర్ ల ద్వారా మట్టిని తొలి రోడ్డును వేశారు.

ఎడ్లబండ్ల పోటీలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని పెడపల్లి గ్రామ సమీపంలో దొడ్డి గుండ్ల అక్కమ్మ గారి పరుష సందర్భంగా ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. తొలుత అమ్మవారికి పెడపల్లి కాయలోల్ల కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎడ్లబండ్ల పోటీలను నిర్వహించారు. వివిధ మండలాల నుండి వచ్చిన రైతులు ఎడ్లబండ్ల పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలలో మొదటి బహుమతిగా నల్లగుట్లపల్లి రాము పదివేల రూపాయలు, గెలుచుకోగా, ద్వితీయ బహుమతిగా కొత్తచెరువుకు చెందిన కోళ్ల కేశవ రూ. 8వేలు, తృతీయ బహుమతిగా బుక్కపట్నం మండలం జంగల శ్రీనివాసులు రూ. 6వేలు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కాయల రాము, తెలుగుదేశం నాయకులు మాజీ సర్పంచి శ్రీ రామ్ నాయక్, శివప్ప, డాక్టర్ రాఘవేంద్ర, భాస్కర్ రెడ్డి, ఆకుల కుల్లాయప్ప, వెంకట రాముడు ,గువ్వలగుట్టపల్లి గంగాధర్, వీరజిన్న, మని, వీఆర్ఏ గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణులకు శుద్ధ జలం అందించాలి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలనే ఉద్దేశం తోనే కేంద్ర ప్రభుత్వం జలజీవన్ పథకాన్ని ప్రవేశ పెట్టిందని, జలజీవన్ మిషన్ కేంద్ర బృందం అధికారులు అనీల్ కుమార్ బారి, శశికుమార్ బాషిర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని సంకేపల్లి, సానేవారిపల్లి పంచాయతీల్లో పర్యటించిన వారు ఇంటిటికి తాగునీటి సరఫరా విధానం, నీటి నాణ్యత, వ్యక్తిగత మరుగుదొడ్లు, పారిశుధ్యం పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శాంతన్న, ఈవోఆర్డీ కృష్ణకుమార్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమికి నీలకంఠాపురంలో భిక్షాటన

ప్రజాశక్తి - మడకశిర రూరల్

మండల పరిధిలోని నీలకంఠాపురం గ్రామంలో సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి గ్రామస్తులతో కలిసి బుధవారం భిక్షాటన చేశారు. మడకశిర పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం నిర్వహించే గురు పూర్ణిమ పూజ సందర్భంగా వారు భిక్షాటన చేశారు. వారు భిక్షాటన చేసి సేకరించిన వస్తువులను మడకశిర సాయిబాబా ఆలయం వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నీలకంఠేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లాకు మరింత పేరు తీసుకురావాలి : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఇదే సాంప్రదాయంతో మునుపటి లాగే విధులు నిర్వహించి వచ్చే అధికారులకు కూడా ఇదే తోడ్పాటు అందించి జిల్లాకు మంచి పేరు తెచ్చి పెట్టాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. బదిలీపై వెళ్తున్న జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డికి బుధవారం ఉదయం పరేడ్ మైదానంలో ఎఆర్ హోంగార్డులు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు ఫరేడ్ కార్యక్రమం నిర్వహించారు. పరేడ్ మైదానంలో మొదట ఎస్పీకి అదనపు ఎస్పి ఎన్. విష్ణు, ఏఆర్ డీఎస్పీ జెడ్ విజయకుమార్ బొకేలు అందజేసి స్వాగతం పలికారు. ఓపెన్ టాప్ జీపులో జిల్లా ఎస్పీ పరేడ్ మైదానంలో ఏఆర్ హోంగార్డు బ్యాండ్ సిబ్బంది ఆత్మీయ వీడ్కోల పరేడ్ నిర్వహించారు. పెరేడ్ కమాండర్ గా వ్యవహరించిన రవికుమార్ నుండి గౌరవవందనం స్వీకరించి, ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పెరేడ్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా పోలీస్ డాగ్ ఎస్పీ కి బొకే అందజేయగా, సిబ్బంది నుండి ఆత్మీయ వీడ్కోలు తీసుకున్నారు. ఈ సందర్భంగాఎస్పీ మాట్లాడుతూ 15 నెలల కాలంలో చేపట్టిన ప్రతి కార్యక్రమానికి పోలీస్ అధికారులు, సిబ్బంది అందించిన సహకారం అభినందనీయమన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ

ఈ కార్యక్రమంలో ఆర్ఐలు చంద్రశేఖర్, వలి, రవికుమార్, ఆర్ఎస్ఐలు, ఏఆర్ ఏఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్

ప్రజాశక్తి- పెనుకొండ

రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి తన సొంత నిధులతో పెనుకొండలో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ 400వ రోజుకు చేరుకుందని తెలుగుదేశం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పెనుకొండ నియోజక వర్గ కేంద్రంలో సవిత ఎంతో వ్యయ ప్రయాసలతో 400 వందలు రోజులుగా అన్నా క్యాంటీన్ నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. పెనుకొండ నియోజక వర్గం పెనుకొండ మండలంలోని గొందిపల్లి గ్రామ పొలంలో గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఏపీఐఐసీ సర్వే చేసి పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో రైతులు భూములు ఇస్తే వైసీపీ ప్రభుత్వం రైతులకు పరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. టిడిపి ప్రభుత్వం ఏర్పడిన ఒక నెలకే మంత్రి సవిత కేబినెట్‌లో చర్చించి పరిహారం అందే విధంగా కృషి చేశారన్నారు. రెండు రోజులుగా రైతులు ఖాతాల్లో పరిహారం సొమ్ము జమ అవుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవ నాయుడు, వెంకటరమణ, చంద్రమౌళి, కేశవయ్య, టిడిపి పట్టణ అధ్యక్షులు శ్రీరాములు, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, రూరల్ కన్వీనర్ సిద్దయ్య, డివి ఆంజనేయులు, జప్రల్లా ఖాన్, మాజీ సర్పంచి అశ్వర్థ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఏర్పాటుకు సంతకాల సేకరణ

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలో మరో బ్యాంకు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, నాయకులు బుధవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టు పరిశ్రమగా పేరొందిన గ్రామంలో చీరల వ్యాపార నిమిత్తం ఆంధ్రప్రదేశ్ నుండే కాక హైదరాబాద్, తమిళనాడు, ముంబై, బెంగళూరు తదితర ప్రాంతాల నుండి వ్యాపారస్తులు నిత్యం వస్తుంటారన్నారు. దీనికి తోడు కియా పరిశ్రమ, అనుబంధ పరిశ్రమలు దగ్గరగా ఉండడంతో ఉద్యోగస్తులు కూడా పెద్ద ఎత్తున గ్రామంలో నివసిస్తున్నారన్నారు. గ్రామంలో 30 వేల మందికి పైగా జనాభా ఉందని వీరందరికీ ఒకే బ్యాంకు ఉండడంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. గంటల కొద్ది బ్యాంకు వద్ద పడి కాపులు కాయాల్సి వస్తుందని వారు తెలిపారు. మరో బ్యాంకు ఏర్పాటు చేస్తే సమస్య తొలగిపోతుందని, అందుకోసం సంతకాల సంతకాల సేకరణ చేపట్టామనితెలిపారు. సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రి సవితకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సిద్ధ లింగప్ప, పవన్ కన్వీనర్ వడ్డే సురేష్, మద్దిలేటి, రమేష్ గోపి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డి క్షమాపణ చెప్పాలి



హిందూపురంలో జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

జర్నలిస్టులు, మీడియాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి వెంటనే క్షమాపన చెప్పాలని ధర్మవరం ప్రెస్‌క్లబ్ సభ్యులు డిమాండ్ చేశారు. విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ధర్మవరం ప్రెస్ క్లబ్ కమిటి ఆధ్వర్యంలో పాత్రికేయులు బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. కాలేజ్ సర్కిల్ నుండి కళాజ్యోతి సర్కిల్ వరకు నిరసన ర్యాలీని కొనసాగించి అంబేద్కర్ విగ్రహం ఎదుట విజయసాయిరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడి నుంచి ర్యాలీగా వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సిఐ సుబ్రమణ్యంకు వినతిపత్రం ఆందజేశారు. ఈ ర్యాలీలో టీడీపీ నాయకులు కిరోసిన్ పోతలయ్య, కత్తుల బాబ్జి ,నాగరాజు, జనసేననాయకులు బాలక్రిష్ణ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగుమధు, చేనేత కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటనారాయణ, శంకరచంద్ర, గట్టునాగరాజు,ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజి నేయులు, పెద్దన్న, యాదగిరి, రామక్రిష్ణ, ప్రెస్ క్లబ్ కమిటి అధ్యక్షులు జానపాటిమోహన్, సభ్యులు రాము, రమేశ్ నాయుడు, గజ్జలరాజా, శ్రావణ్ కుమార్, గ్రంధిశ్రీనివాసులు, ప్రసాద్ రెడ్డి, నాగార్జున, మజ్జిగభాస్కర్, దేవేంద్ర, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి జర్నలిస్టులను అసభ్య పదజాలంతో దూషించడాన్ని ఖండిస్తూ హిందూపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాత్రికేయులు ప్రెస్ క్లబ్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అక్కడి నుంచి ర్యాలీగా వన్ టౌన్ స్టేషన్ కు వెళ్లి విజయ సాయి రెడ్డి పై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మడకశిర : విజయసాయి రెడ్డి జర్నలిస్టులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా పట్టణంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక వైయస్సార్ సర్కిల్ నుండి పోలీస్ స్టేషన్ దాకా జర్నలిస్టులు నల్ల రిబ్బన్లు ధరించి ర్యాలీ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్లో వినతి పత్రాన్ని సమర్పించారు..

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి - హిందూపురం

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు గురువారం నుంచి తొమ్మిది రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి, కోర్సు డైరెక్టర్ గంగప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీచ్ టూల్ పేరిట శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. హిందూపురం నియోజకవర్గంలోని హిందూపురం, లేపాక్షి , చిలమత్తూరు, పెనుకొండ నియోజకవర్గం లోని పరిగి , మడకశిర నియోజకవర్గంలోని మడకశిర, రొళ్ళ, ఆగళి, గుడిబండ, అమరాపురం మండలాల్లోని సీనియర్ ఎస్‌జి. టీచర్లకు, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులకు, స్కూల్ అసిస్టెంట్లకు, హెచ్ఎం లకు, కొంతమంది సిఆర్ఎంటిలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. హిందూపురం పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఈ శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 97శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-హిందూపురం

ఇటీవల విడుదలైన డిగ్రీ ఆరో సెమిస్టర్ ఫలితాల్లో ప్రభుత్వ ఎన్ఎస్ పిఆర్ మహిళా డిగ్రీ కళాశాల 97శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి తెలిపారు. శ్రీకష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఆరో సెమిస్టర్ డిగ్రీ ఫలితాల్లో బీఎస్సీ గ్రూప్ లో 97శాతం మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించగా బీకాం గ్రూప్ లో 92 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె తెలిపారు. అలాగే ఫిబ్రవరిలో జరిగిన ఐదో సెమిస్టర్ బి.ఎస్సీ. విద్యార్థినులు 87 శాతం ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి మార్కులు సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపల్ అభినందించారు. కాగా డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందగోరే విద్యార్థినిలు ఆన్ లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకోవడానికి ఈ నెల 25 వ తేదీ వరకు గడువు పొడిగించబడిందని చెప్పారు.

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని ధర్మవరం -గోరంట్ల ప్రధాన రహదారిలో జగరాజుపల్లి వద్ద కొండపై ఉన్న ఓబులేశ్వర స్వామి ఆలయం వద్ద ఏకాదశి ఉత్సవాలను ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. పుట్టపర్తి, కొత్తచెరువు ,గోరంట్ల బుక్కపట్నం, మండలాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఈ కార్యక్రమంలో ఓబులేశ్వర స్వామి దేవస్థానం సేవ సమితి అధ్యక్షులు రిటైర్డ్ ఎస్ఐ గోవిందప్ప, గౌరవ అధ్యక్షులు సూర్యనారాయణ రెడ్డి, ముఖ్య సలహాదారుడు వాసుదేవరెడ్డి, జాయింట్ సెక్రెటరీ దయ్యాల ఉమాపతి, ఓబులేశ్వర స్వామి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల పరిధిలోని కదిరేపల్లి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి ఉత్సవాలు నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని చల్లాపల్లి, కదిరేపల్లి, ఓబుళదేవరపల్లి గ్రామాలనుండి మహిళలు జ్యోతులతో దేవాలయం వద్దకు తరలివచ్చారు. అనంతరం గుడి బయట ఉట్లమాను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సౌజన్య దామోదర్, మాజీ సర్పంచి రామకృష్ణ, సంజీవరెడ్డి, రిటైడ్ డీఎస్పీ తిమ్మిరెడ్డి, శరత్ చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : ఆషాడ మాస ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి లో హరిహర దేవాలయంలో వెంకటేశ్వర స్వామి కళ్యాణం భక్తుల నడుమ వైభవంగా నిర్వహించారు. మహారాష్ట్ర, గోవా నుంచి ఏకాదశి వేడుకలు జరుపుకోవాడానికి సుమారు 3000 మంది భక్తులు ప్రశాంతి నిలయానికి వచ్చారు. సత్య సాయి మహా సమాధి సన్నిధిలో ఏకాదశి వేడుకలు జరుపుకున్నారు. మహారాష్ట్ర, గోవా భక్తులతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది.

ఎంఎన్‌సి కంపెనీల్లో సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

ప్రముఖ ఎంఎన్‌సి కంపెనీల్లో సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కొడికొండ చెక్‌పోస్టులోని రక్షా అకాడమీ హెడ్ ట్రైనీ కిరీట్ నాయర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ బెంగళూరులోని పలు మల్టీనేషనల్ కంపెనీల్లో పనిచేసేందుకు యువతీ,యువకులుకు అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. వేతనం రూ. 19 వేలు ఉంటుందన్నారు.దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రక్షా అకాడెమీలో శిక్షణ కూడా అందజేయనున్నట్టు తెలిపారు. 10 వ తరగతి ఉత్తీర్ణత సాధించి 18-30 ఏళ్ల లోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కన్నడ, ఇంగ్లీష్ భాషలు తెలిసి ఉండాలన్నారు. రాష్ట్రంలో ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు 6281557937, 6300766517 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన పరిటాలశ్రీరామ్


ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధితోపాటు పార్టీ బలోపేతంపై మంత్రి నారాలోకేష్‌తో ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్ చర్చించారు. ఉండవల్లిలోని నివాసంలో మంత్రి నారా లోకేష్‌ను పరిటాల శ్రీరామ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని రాజకీయాలపై చర్చించుకున్నారు. చేనేతల అంశాన్ని కూడా పరిటాల శ్రీరామ్ లోకేశ్ వద్ద ప్రస్తావించారు.



మంత్రి లోకేష్‌తో పరిటాల శ్రీరామ్

ఏకలవ్యుని జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి



ఏకలవ్యుడి చిత్రపటానికి నాయకుల నివాళి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఏకలవ్య జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలని ఏపీ ఎరికుల ప్రజా పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆ సంఘం కార్యాలయంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగుల ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఏకలవ్య చిత్రపటానికి మాలలు వేసి స్మరించు కొన్నారు. ఈ సందర్భంగా గంగులప్ప మాట్లాడుతూ ఏకలవ్య జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించి ఆరోజు ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పలుచోట్ల ఎరికుల కులస్తులపై దాడులు అవమానాలు జరుగుతున్నాయని అలాంటి సంఘటనలు జరగకుండా దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సమితి జిల్లా అధ్యక్షులు కేశప్ప, మహిళా అధ్యక్షురాలు అనిత, కార్యదర్శి గుజ్జల రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : కొత్తచెరువులో ఏకలవ్య జయంతి వేడుకలను ఎరుకల సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ సేవా సంఘం సెక్రటరీ దేవరకొండ గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా యూత్ అధ్యక్షులు వేణు, సంఘం నాయకులు పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

చిరు వ్యాపారి దారుణ హత్య

ప్రజాశక్తి-పెనుకొండ

దేవాలయంలో నిద్రిస్తున్న ఓ చిరు వ్యాపారి దారుణ హత్యకు గురైన సంఘటన పెనుకొండ మండలం గుట్టూరులో బుధవారం చోటుచేసుకుంది. కియా ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రంగడు తెలిపిన వివరాలు... హిందూపురంలోని బోయ వీధికి చెందిన చిన్న అంజనప్ప(63) అతని భార్య మంజమ్మ పూజా సామాగ్రిని గ్రామాల్లో తిరుగుతూ అమ్ముకొని జీవనం సాగించేవారు. ఈ నేపథ్యంలో గూగూడు ఉత్సవాలలో భార్య మంజమ్మ వ్యాపారం చేస్తుండడంతో చిన్న అంజన్న మండలంలోని గ్రామాలను తిరుగుతూ పూజా సామాగ్రి వ్యాపారం నిర్వహించాడు. బుధవారం గుట్టూరు గ్రామంలో వారపు సంతలో వ్యాపారం చేసుకుని భార్య వద్దకు వెళ్లేందుకు మంగళవారం రాత్రి గ్రామంలో కొల్లాపురమ్మ దేవాలయంలో నిద్రించాడు. ఆ సమయంలో మునిమడుగు గ్రామానికి చెందిన గంగాధర్ ఉరఫ్ గంగాద్రి అనే వ్యక్తి దేవాలయంలో నిద్రిస్తున్న చిన్న అంజనప్పతో వాదనకు దిగాడు. దేవాలయంలో నిద్రించకూడదని హెచ్చరించాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో కోపంతో రెచ్చిపోయిన గంగాద్రి అంజినప్పను గుడిలో నుంచి కొట్టుకుంటూ ఈడ్చుకొని బయటికి వచ్చి అతని మెడలో ఉన్న టవల్‌తో గొంతుకు బిగించాడు. దీంతో అంజినప్ప మృతిచెందాడు. విషయం తెలుసుకున్న డిఎస్‌పి బాబీజాన్ సైదా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి పట్టణ సమీపంలోని ఆర్ వి జానకి రామయ్య పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన ప్రమాదంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది.కొత్తచెరువు నుంచి పుట్టపర్తి జనరల్ ఆసుపత్రికి ప్రయాణికులతో వస్తున్న ఆటో ఎయిర్‌పోర్టు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్దకు రాగా అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న ప్రయాణికులతో పాటు డ్రైవర్ రవి కి తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికుల్లో లోచర్ల గ్రామానికి చెందిన ఒక గర్భిణీ కూడా ఉంది. గర్భిణీతో పాటు డ్రైవర్ రవి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పుట్టపర్తి అర్బన్ పోలీసులు తెలిపారు.

ఘనంగా మొహర్రం సంబరాలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

బత్తలపల్లిలో చిన్న ఖాసీంస్వామి మొహరం వేడుకలు ఘనంగా జరిగాయి.. మొహరం వేడుకలలో చివరిరోజైన 10వ రోజు మండల పరిధిలోని పోట్లమర్రి, గంటాపురం, వేల్పుమడుగు, రాఘవంపల్లి, ముష్టూరు గ్రామాల పీర్లు బత్తలపల్లి చిన్నఖాసీం, పెద్ద ఖాసీం స్వాములతో భేరీ అయ్యాయి. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాలలో నిలిపిన పీర్లకు ఆయా గ్రామాలలోని వేడుకలను వైభవంగా నిర్వహించారు. రోడ్ల కిరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగాఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ధర్మవరం రూరల్ సిఐ ఆరోహణరావు, బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులు, 50 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.

గాండ్లపెంట : మండలంలోని గాండ్లపెంట, తూ పల్లి, యనమల వారి పల్లి, జీనులకుంట, కటారపల్లి తదితర గ్రామాలలో బుధవారం ఘనంగా మోహరం వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ కృష్ణవేణి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సోమందేపల్లి : పెనుకొండ పట్టణంలో మొహర్రం సందర్భంగా బుధవారం చివరి రోజు జల్దీ కార్యక్రమంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పెద్ద పీర్ల చావిడి నుండి పీర్ల ను బాబయ్య స్వామి దర్గా పీఠాధిపతి తాజ్ బాబా ఆధ్వర్యంలో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. తాజ్ బాబా ఆధ్వర్యంలో అన్నదానం,ప్రసాదం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైభవంగా పాండురంగ స్వామి రథోత్సవం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ముదిరెడ్డిపల్లిలోని రుక్మిణి పాండురంగ స్వామి ఉత్సవాల్లో భాగంగా తొలి ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం స్వామి వారి రథోత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జయప్ప, పల్లా లక్ష్మికుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు రామాంజనేయులు, పురుషోత్తం, భాస్కర్ తో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదానం

హిందూపురం : మొహరం పురస్కరించుకుని బుధవారం జిల్లా షహీద్ టిప్పు సుల్తాన్ మానవతా రక్తదాన సంఘం ఆధ్వర్యంలో యువకులు పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ మానవతా రక్త దాన సంఘం జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూక్ ఖాన్ మాట్లాడుతు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే మొహరం సందేశం అన్నారు. అనంతరం డాక్టర్ చరణ్, సామాజిక సేవకులు రక్తదాతలకు సర్టిఫికెట్లు మెమెంటోలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉబెదుల్లా హుసేన్, షేక్ షబ్బీర్, కౌన్సిలర్ ఆసిఫ్, హిందూపురం ఆక్సిజన్ సేవా సంఘం అధ్యక్షులు ఫైరోజ్, రఫీబ్, ఉమర్, సాదిఖ్, నస్రుల్లా, రియాజ్, విజయ్ కుమార్, అబ్దుల్ సలామ్, ఇద్రీస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుట్ ఐటికి 'శ్రీవిజ్ఞాన్' విద్యార్థిని

ఓబుళదేవరచెరువు : శ్రీ విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదివిన విద్యార్థిని దివ్యశ్రీ ఇడుపులపాయ ట్రిపుట్ ఐటిలో సీటు సాధించింది. నల్లమాడ మండలం పులగం పల్లికి చెందిన దివ్యశ్రీ ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు తమ పాఠశాలలో చదివి పదవ తరగతిలో అత్యధికంగా 583 మార్కులు సాధించి ట్రిపుట్ ఐటిలో సీటు సాధించడం సంతోషంగా ఉందని శ్రీ విజ్ఞాన్ కరస్పాండెంట్ మస్తాన్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు, కరెస్పాండెంట్ అభినందించారు.

అభివృద్ధికి సహకరించండి : ఎమ్మెల్యే

కదిరి అర్బన్ : నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కోరారు. పట్టణంలోని రోడ్డు భవనాల అతిథిగృహంలో పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో చేపట్టవలసిన అభివృద్ధిపై వారితో చర్చించారు. పంచాయతీ శాఖలో జరగాల్సిన అభివృద్ధి పనులను సత్వరమే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులుకృష్ణమోహన్ నాయుడు, పంచాయతీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

'ప్రజలకు న్యాయం చేస్తాం'

ధర్మవరం టౌన్ : ప్రజలందరికీ తగిన న్యాయం చేసేందుకే బార్ అసోసియేషన్ కమిటీ ఉందని, ఇందుకు సీనియర్ జూనియర్ న్యాయవాదుల సహాయ సహకారాలు అభినందనీయమని అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణమూర్తి, కార్యదర్శి గోపికృష్ణ తెలిపారు. అంతర్జాతీయ న్యాయ దినోత్సవ సందర్భంగా ఎంఎంకె జిల్లా అధ్యక్షులు సయ్యద్ రోషన్ జమీర్, ధర్మవరం నియోజకవర్గ అధ్యక్షులు సయ్యద్ దాదా పీర్, ధర్మవరం నగర అధ్యక్షులు ఎం పారూక్, పుట్టపర్తి అధ్యక్షులు ఎస్ మస్తాన్ వలి కలిసి ధర్మవరం కోర్టు న్యాయవాదులకు, బార్ అసోసియేషన్‌కు అంతర్జాతీయ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జమీర్, దాదా పీర్ మాట్లాడుతూ న్యాయ పరిరక్షణకు న్యాయవాదులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి అబ్దుల్లా, సీనియర్ న్యాయవాదులు గుంటప్ప, శంకర నారాయణరెడ్డి పాల్గొన్నారు.

రెండో రోజుకు రిలేదీక్షలు

కదిరి టౌన్ : న్యాయవాదిపై జరిగిన దాడిని ఖండిస్తూ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు బుధవారం రెండో రోజు కొనసాగాయి. ఈసందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాది రామస్వామి నాయుడుపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

19న ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం

పుట్టపర్తి అర్బన్ : పుట్టపర్తి మున్సిపాలిటీ ఎక్స్ అఫీషియో సభ్యురాలుగా స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఈనెల 19న ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు కమిషనర్ అంజయ్య తెలిపారు. ఈ మేకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 19న ఉదయం 11 గంటలకు చైర్మన్ తుంగ ఓబుళపతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు.. ఈ సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.